స్కెచ్

# అశ్రుతర్పణం

వి. నరసింహమూర్తి

అతడీలోకాన్నుండి అదృశ్యమైనాడు. అదృశ్యుడైతే ప్రార్థనకు తిరిగి సాక్షాత్కరించ గలడనుకోవచ్చు. అతడి ప్రతి అణువూ అగ్నికీలల కాహుతైపోయింది. భౌతిక శరీరం పటాపంచలయిపోయింది.

నిన్నగాక మొన్న మేం కలుసుకున్నాం. మాట్లాడుకున్నాం. నవ్వుకున్నాం; ఈరోజు అతన్ని మాట్లాడించలేం. అతడిప్పుడో అధిభౌతిక వ్యక్తి.

మా ముచ్చట్లు, మా సహవాసం అంతా నన్ను ముసురుకుంటున్నది- మరణించాడని ఎలా అనుకోటం? - అంతా ఇప్పుడు జరుగుతున్నది. మేం మాట్లాడుకుంటున్నాం. మీరువినలేరుగాని మేం నవ్వుకుంటున్నాం. యిష్టంలేని వాళ్ళని తిట్టుకున్నాం. యిష్టమున్న వాళ్ళని ప్రశంసించుకుంటున్నాం.

అతడు నాలో సంభాషణల స్వరూపంగా నిలచి పోయాడు. అతడికి భవిష్యత్తులోగల అచంచల విశ్వాసం, స్వీయప్రతిభలోగల దృఢ నమ్మకం, కన్నుల్లో కనుకొలకుల్లో మెరిసే కాంతుల్లో, పెదవులపై మెదిలేనవ్వుల్లో విశదంగా విదితమవుతుంది.

కవులూ, కావ్యాలూ, స్వీయ సాహిత్యానుభవాలూ అతని హృదయానికి సన్నిహితమైన సంభాషణా విషయాలు. ఎన్నోరాత్రులు, నిర్మానుష్యమైన నిశాసమయాల్లో, గంటల తరబడీ, కాలనిర్ణయం లేకుండా మాట్లాడేవాడు.

సాహిత్యంలోకన్న స్వప్నాలన్నీ, నిర్మించుకొన్న హర్మ్యాలన్నీ గాలిలోకి వూదితే సుడిగాలివడికి నిలవగలవా- పింజెల్లా చెదరి గాలిలో లీనమయిపోవ్వూ-

పగల్లా పనిచేసి, అంకెల్లో సంచరించి, వాతావరణంలో మెదిలి, సన్నని కొంపకి చేరుకునేసరికి జీవితాన్నించి ఏమి కోరాలో అతనికర్థమయేది కాదు. వెంటనే వచ్చిన యామినీకాంత విసిరిన గగనకుసుమాలనవలోకిస్తూ,

"ఏమిటీ అగమ్యతమో రహస్యాంగణం అంటే "ప్రకృతి నిర్మాణానికి ప్రతిదానికీ అర్థం కావాలా" అన్న జవాబులో, పైకెగబ్రాకుతున్న పసిబాలనవ్వులో మునిగిపోయే వాళ్ళం.

ఇంకా చిన్నతనం వదలని యౌవ్వనపు తొలిరోజుల్లో ఒకపసి ప్రాణానికి తండ్రిగా బాధ్యత వహించవలసి రావడంతో అప్పుడప్పుడాయాసం వచ్చేది. వెన్నెల్లో మబ్బులి మసకలో, మబ్బుల్లో వెన్నెలతేటలో గ్రహించకసతమతమయ్యేవాడు.

మృత్యుదేవత అతిథి సౌధంలో అడుగిడపోతున్న అస్పష్టఅంతిమదినాల్లో, దేహంలోని అణువులన్నీ పరుగిడుతూ పనిచేస్తున్నా, పరిసర ప్రపంచాన్ని గమనించలేని అచైతన్య అవస్థలో అస్పష్టంగా పలవరించేవాడు.

"పనికిరాదని పారవేసిన

పంచలోహపు తీగెనంటుకు... గొంతుసాగక ఆగిపోయేవాడు. తలవాలిపోయేది.

మేం పాడుకున్న గీతంలో మొదటి చరణమది. కలత జెందిన హృదయంలో నియమం లేకుండా లేచిన భావాల పొంగును, శయ్యలో నడిపించటానికి చేసిన ప్రయత్నమది.

"మనమెవరి ఆధారంతో బ్రతుకుతున్నామండీ" అంటే.

"స్వయంప్రతిభవల్ల."

"ఆత్మవిశ్వాసం మంచిదే. కాని మనమీమెవరూ దాడిచెయ్యరూ!"

"మనమెవరికి అపకారం చేశాం?"

ఈ ప్రశ్నకతని మనసులో ఏవ్యూహాలు మెరిసేవో, అతని జీవితంలో ఏ అధ్యాయం గుర్తుకు వచ్చేదో నిరాశాపూరిత చిరుహాసం గోచరించేదా ముఖంలో.

ఆ చిరుహాసమే కారుమబ్బుగా మారాలా? ప్రసన్న వదనం కజ్జలవర్ణాన్నలముకోవాలా?

ఎంతలో ఎంత మార్పు - కలకరిగిపోయినట్లు- నిద్రలేచిన క్షణానికి నిద్రకూ ఎంతదూరం! ఎవరు

కొలవగలరు! పరిమాణంలేని క్షణం ఎంత ఆవేదనకు కారణం! అతిడి హితులంతా అతడు బ్రతకాలని అహోరాత్రాలు పని చేశారు. అష్టకష్టాలుపడి సేవచేశారు. జీవితమంతా ఆశతోనే బ్రతికి ఆ మూణ్ణాళ్లూ ఆశతోనే మృత్యుదేవతతో సమరం చేశాడు. అంతం లేదనుకున్న బాధకు అనంతశయనంలో అంతం దొరికింది. హితుల కష్టానికి ఫలితం లేకపోయింది. 'కష్టేఫలీ' అన్న వాళ్ళే 'అంతా దైవమాయ' అన్నారు.

"ఏపాపానికిప్రాయశ్చిత్తమో ఈదారిద్ర్యం? ఎవరినీప్రశ్నించేది - ఎవరు జవాబిస్తారు?- ఎన్నో జవాబులున్నాయి."

"మనం పాపాలు చేయలేం"

"అలా అనకండి."

"ఏదో చేశాం - లేకపోతే యింతదయారహితంగా వుండడు దైవం"

"జవాబు దొరకనివాటికి ఆలోచించటందేనికి. మరచిపోండి. ముందుకుపోదామని దీక్షపట్టండి"

"ఎటుచూచినా ఊబే దీక్షవున్నా, ధైర్యమున్నా, బలంలేదు" చాపల్లేచుట్టుకు పోయింది మనస్సు.గుమ్మడికాయల్లే చితికిలబడ్డవిహృదయం.

"పాపాల్లేవనుకోండి."

"ఎలా అనుకోటం"—

నైతికధర్మాల్లో, కష్టం గుప్తంగా వుంటే అనుభవించ వలసిందే."

"అలాగే-పోనీలెండి మనం మంచివాళ్ళం."

"ఎవరి దృష్టిలో?"

"మన దృష్టిలో" వర్తమానాన్ని విడిచి, భవిష్యత్తులోకి దృష్టి సారిస్తూ, నవ్వుతూ నా చేతిలో చేయికలిపేసేవాడు. కొన్నాళ్ళపాటు ఎక్కడలేని ఆనందం, అనుభవం! కాని భవిష్యత్తు ఆదరించేదాకా అతడు జీవించలేదు.

బ్రతికినన్నాళ్ళూ మమతలతో బ్రతికి, చనిపోగానే మమతలకు దూరంకాగలమా-ఆ దివ్యశక్తివుంటే దేవుణ్ణెందుకు నిందించటం?

ఎంతమందికో సాయం చేశాడు. మంచివాడని మెప్పుపొందాడు. వలచి, వలపించుకున్నాడు. విలపించి, విలపింపజేస్తున్నాడు.

ఎందుకూ విలాపం-అతడంటే అతడి సాహచర్యపు మమతలూ. చిత్రాలుగా-అవి మనస్సులో మెలిగితే రూపరహితంగా ప్రేమించలేమూ-అతడింకా వున్నట్లేగా-వేదాంతి వేసిన ప్రశ్నకు సామాన్యునికి దొరికిన సమాధానం హృదయంలో కత్తిలా దూరుతుంది.

పూర్వస్మృతులనే తిరిగితిరిగి నెమరు వేసుకోవాలి. అందులో ఆనందంలేదూ? స్మృతుల్లో నేనా, సృష్టిలోమాత్రం లేదూ ఆ సృష్టికి ఆధారమైన రూపమేదీ?

అందుకనే ఏడుస్తున్నాం. ప్రయోజనం?

సృష్టించాడేగాని, ఏ చిన్న క్రిమికీటకాదుల వల్లకూడరక్షించదలచడల్లేవుంది. లేకఆశక్తుడేమో? మానవాతీతుడికి వ్యాఖ్యానం మనమెలా చెప్తాం!

మమకారంలేకుండా బ్రతికితే మరణం మనల్ని వేధించదు. కాని ప్రేమలులేక బ్రతకటమెలా?

అతడి బ్రతుక్కి వ్యాఖ్యానం అందరికీ అవసర మనిపించుకున్నాడు. అతడు మహానాయకుడు కాడు. కాని జీవంగల వ్యక్తి స్పందించగల మానవుడు.

ఎన్ని ఆశలున్నాయి ముందు జీవితంమీద! ఆ ఆశలకు కాలమిచ్చిన నిష్ఠుర ప్రత్యుత్తరమిదేనా?

బ్రతకాలని ఎందరి నాశ్రయించాడు? బ్రతికినన్నాళ్ళు చావాలనిపించలేదు. అది అసహజమనుకుంటే అతి సహజంగా వచ్చి ఆవరించేసింది. ఎందుకో ఈ దేవత కింత తొందర అని ఆశ్చర్యపడేలోగా అంతా అంతమయిపోయింది. స్వప్నసుందరిలా చంక నేసుకెళితే స్నేహితుడి ప్రతిభకు సంతోషించే వాళ్ళం. బందిలా బెదిరించి తోలుకపోయింది. కనుకనే ఈ విచారం.

మనరాణీ, అతడికి దృశ్యం భీభత్సదృశ్యమో ఆనందమయవిలాసమో—చెప్పలేం. చివరిరోజుల్లో అతడి హృదయావేదన వర్ణించలేం. మాటలకందని మనోవ్యథ, నాళాల్లో రక్తాన్ని పుప్పు త్రిప్పేసింది.

కాని అతడు స్నేహితుడు. హృదయమిచ్చినవాడు. అసమాన ప్రతిభ లేకపోయినా అంతరంగంకల మనిషి. జాలిగుండెగలవాడు - కనుకనే నేడీవార్త ఎవరెవరికో దుర్వార్తనిపించింది. ఏలోకంలో వున్నాడో- వుంటే అతడికి ఆత్మకి శాంతి యీ తలపులు ఈ లోకంలోవున్న మా మనసుకు ఓదార్పు...

★